## మానవ పాదం

ఇంటి ముఖం చూసి
చాన్నాళ్లయిందని
ఇంటి కొచ్చావంటే
నీ ఇల్లు నువ్వే వెదుక్కోవాలిక్కడ

ఒకప్పుడు
గాలిపటాలెగరేసుకున్న మైదానాలు
ఉగాది నాడెక్కిన వేపచెట్లు
ఈత నేర్చుకున్న చెరువులు
పాలకోసం పడిగాపులు కాసిన పశువుల కొట్టాలు
అతిధు లెందరినో ఆదరించిన విశాల భవనాలు
ఉద్యానవనాల్లో పర్ణశాలల్లాంటి ఇళ్లు
ఎన్నని వెదకగలవు?

నిజానికి ఇక్కడ
నిరంతరం ఎవరిని వారే వెదుక్కుంటారు
ఎగిరిపోయిన వసంతం కోసం
వసంతాలు వసంతాలు ఎదురు చూస్తారు

చూస్తూ చూస్తూనే ఇక్కడ
ఇళ్లలికినంత సహజంగా
గుట్టలు పుట్టలు – గుడిసెలు చెరువులు
చదునై పోతాయి
చదునై పోయిన నేలలో
సమాధుల్లా సరిహద్దు రాళ్లు నిలుస్తాయి
అత్యవసరంగా అందులో ఇళ్లు మొలుస్తాయి

ఏపుగా ఆకాశహర్మ్యాలై పెరుగుతాయి
దుకాణలు కార్ఖాణాలు జీవనాధారాలుగా వెలుస్తాయి

అయినా ఎవరికివారు –
నీటికోసం భూగర్భాన్ని తూట్లు తూట్లు పొడవాల్సిందే!
ప్రాణవాయువు కోసం గాలిని జల్లెడలు పట్టాల్సిందే!
స్మశానా ల్లో  చోటైనా బతికుండగా నమోదవాల్సిందే!
విస్తరిస్తున్న మానవపాదానికి
విశాల ప్రపంచం నేల చెప్పు
కాళ్లలోకి కూడా రాదు
తొందర్లోనే
నదులూ సముద్రాల్లో కూడా ఇళ్లు పుష్పించాల్సిందే!